విశాలాంధ్ర అనంతపురం

www.visalaandhra.com

కర్నూలు, బుధవారం 8, జనవరి 2025

# యువత దేశానికి స్ఫూర్తి

## ఏఐవైఎఫ్ మహాసభలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

**విశాలాంధ్ర-రాయదుర్గం టౌన్:** ఏఐవైఎఫ్ 20వ జిల్లా మహాసభలు మంగళవారం పట్టణంలోని జూనియర్ కాలేజ్ మైదానంలో జరిగింది. ఈ సమావేశానికి ప్రభుత్వ విప్ స్థానిక ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కమ్యూనిస్టు సిద్ధాంతాల గల యువత దేశానికి స్ఫూర్తిదాయకమన్నారు. కమ్యూనిస్టులు సిద్ధాంతాల గల యువకులు ధైర్యవంతులుగా ఉండి ఎటువంటి సమస్య ఎదురైన పోరాడే శక్తి ఉంటుందన్నారు. తాను కూడా ఏఐఎస్ఎఫ్ క్రియ సభ్యులుగా ఉన్నానని గుర్తు చేసుకున్నారు. కమ్యూనిస్టులు సిద్ధాంతాలకు కట్టుబడి ఉంటారన్నారు. కమ్యూనిస్టులకు స్వార్థం, ద్వేషం అలాంటివి లేకుండా నిస్వార్థంగా ప్రజల కోసం పనిచేసే శక్తి కలిగి ఉంటారన్నారు. ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పారిశ్రామిక రంగం గా రాష్ట్రాన్ని అభివృద్ధి చేసి యువతకు 20 లక్షల ఉద్యో గాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నారన్నారు. యువకులు క్రమశిక్షణతో మెలిగి బుద్ధిగా చదువుకొని ఉన్నత స్థానాలకు ఎదగాలని కోరారు.

# చింతకుంటలో ఘనంగా గ్రామదేవర ..

**విశాలాంధ్ర-పుట్లూరు:** మండలంలోని చింతకుంట గ్రామంలో గ్రామదేవర ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సిపిఐ పుట్లూరు మండల కార్యదర్శి డి.పెద్దయ్య హాజరయ్యారు, గ్రామదేవర కార్యక్రమం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చింతకుంట గ్రామ పెద్దలు, పెద్దన్న, నారాయణ, కృష్ణయ్య, సూరితో పాటు కాలనీవాసులు ఐకమత్యంతో కలిసి కట్టుగా గ్రామ దేవర నిర్వహించారు.

# కోర్టు కేసుల పరిష్కారంలో జవాబుదారీతనం ఉండాలి

## కలెక్టర్ వినోద్‌కుమార్.వి

**విశాలాంధ్ర-అనంతపురం:** కోర్టు కేసుల పరిష్కారంలో అధికారులకు జవాబుదారీతనం ఉండాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూ భవనంలో కోర్టు కేసులపై ఆయా శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోర్టు కేసులకు సంబంధించి నోడల్ అధికారులను నియమించామని ,పరిపూర్ణంగా కోర్టు కేసులను పరిష్కారం చేయాలన్నారు. ప్రజలకు ఎక్కడ న్యాయం జరగకపోతే కోర్టుకు వెళ్లడం జరుగుతుందని, అలా జరగరాదని, అధికారుల వద్ద కేసులు పరిష్కారం అవుతాయనే నమ్మకం కలగాలన్నారు. ప్రతిరోజు గంటసేపు కోర్టు కేసులపై సమయం కేటాయిస్తే, క్రమశిక్షణ చూపిస్తేనే ఆ శాఖలు బాగవతాయన్నారు. ఈ సమావేశంలో డిఆర్‌ఓ ఎ.మాలోల, కలెక్టరేట్ సి సెక్షన్ సూపరింటెండెంట్ వసంతలత, కలెక్టరేట్ ఏవో అలెగ్జాండర్, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

# హెల్మెట్ తప్పనిసరి : డీఎస్పీ

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్:** ద్విచక్రవాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలని కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబు తెలిపారు. మంగళవారం బొమ్మనహాల్ పోలీస్‌స్టేషన్ తనిఖీ చేసి రికార్డులను పోలీసు సిబ్బంది పనితీరు పరిశీలించారు. సివిల్, భూ తగాదాలు, పాత గొడవలు, కర్నాటక మద్యం విక్రయిస్తున్నట్లు అనుమానం ఉన్న వ్యక్తులను గుర్తించి బైండోవర్ చేయాలని, స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. విలేకర్లుతో మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. ఎస్ఐ నబి రసూల్, ఏఎస్ హనుమంతరెడ్డి, మల్లికార్జున, హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాసులు, రుద్ర, పాల్గొన్నారు.

# ప్లేస్‌మెంట్ ఎంపికలు..

**విశాలాంధ్ర-జేఎన్టీయూపీ :** ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (అనంతపురం)లో మంగళవారం కల్పతరు ప్రాజెక్ట్స్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీ ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. ప్రభుత్వ పాలిటెక్నిక్, అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్, ఉరవకొండ, ప్రభుత్వ పాలిటెక్నిక్, తాడిపత్రి, ప్రభుత్వ పాలిటెక్నిక్, కళ్యాణదుర్గం, మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్, హిందూపురంలలో చదువుతున్న సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ డిప్లొమా ఫైనల్ ఇయర్ విద్యార్థులు 92 మంది హాజరుకాగా మెదట రాత పరీక్షను నిర్వహించి అందులో నుండి 64 మంది విద్యార్థులు ఇంటర్వ్యూలకు ఎంపికయ్యారు. కంపెనీ ప్రతినిధి ఎస్ఎన్ దినేష్, హెచ్.ఆర్ బృంద సభ్యులు ఇంటర్వ్యూలను చేపట్టి తదుపరి ఫలితాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి. కళాశాల ప్లేస్‌మెంట్ ఆఫీసర్ ఎన్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# బాలికల చదువే ధ్యేయం

**విశాలాంధ్ర-కణేకల్లు :** సీడీపీఓ ఆధ్వర్యంలో మంగళవారం కణేకల్లులో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథి తహసీల్దార్ ప్రణి కుమార్ మాట్లాడుతూ బాలికల చదువే ధ్యేయం అన్నారు. మండలంలో ఎక్కడా బాల్యవివాహాలు జరుగకుండా ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఎంపీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ బాల్య వివాహం సమాజ అభివృద్ధికి ఆటంకమని, 18 ఏళ్లలోపు అమ్మాయిలకి పెళ్లిళ్లు చేసే సంస్కృతిని రూపుమాపే దిశగా అందరం సమిష్టిగా కృషి చేద్దామని తెలిపారు. ఎంఈఓ, ఏఎస్ఐ మాట్లాడుతూ బాల్య వివాహ నిషేధ చట్టం గురించి తెలిపారు. మెడికల్ ఆఫీసర్ టీనేజ్ ప్రెగ్నెన్సీ ప్రమాదాలు, మాతృ మరణాలు శిశు మరణాలు వీటన్నింటికీ కారణం బాల్య వివాహమే అన్నారు. మహిళా పోలీసులు అంగన్వాడీ కార్యకర్తలు టీచర్స్ ఏఎన్ఎం, వెల్ఫేర్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

# పెండింగ్ నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలి

- రైతు పెట్టుబడి సాయం నిధులు విడుదల చేయాలి
- ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య డిమాండ్

**విశాలాంధ్ర-అనంతపురం:** రాయలసీమలోని పెండింగ్ నీటి ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేయాలని ఏపి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.ఈశ్వరయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నప్పటికీ రాయలసీమ కరువు నివారించే పెండింగ్ నీటి పారుదల ప్రాజెక్టులపై శ్రద్ధ చూపించకపోవడంతో పాటు రైతు పెట్టుబడి సాయం నిధులను రైతులకు అందించలేదని మండిపడ్డారు. మంగళవారం సిపిఐ కార్యాలయంలో జరిగిన విలేఖరుల సమావేశంలో అనంతపురం జిల్లా రైతు సంఘం ప్రధాన కార్యదర్శి సి.మల్లికార్జునతో కలసి ఆయన మాట్లాడారు. గత ఎన్నికల్లో రైంతాగానికి హామీలు ఆర్భాటంగా ప్రకటించి అధికారం చేజిక్కించుకున్న అనంతరము తోకముడుచుకుంటే రైతు సంఘం రైతులను పెద్ద ఎత్తున సమీకరించి ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఎన్నికల్లో రైతులకు పెట్టుబడి సాయం కింద ప్రతి రైతు కుటంబానికి రూ. 20వేలు అధికారంలోకి వచ్చిన వెంటనే ఇస్తానన్న హామీ ఇంతవరకు ఇవ్వకపోవడం బాధాకరం అన్నారు. ఈ ఏడు నెలల కాలంలో సుమారు రాష్ట్ర వ్యాప్తంగా 100 మంది పైగా రైతులు ఆత్మహత్యలు చేసుకుంటే కనీసం వారి కుటుంబాలను కూడా పరామర్శించకపోవడంతో పాటు బాధిత రైతు కుటుంబాలకు ఇవ్వాల్సిన ఎక్స్‌గ్రేషియా కూడా చెల్లించకపోవడం చాలా దారుణమన్నారు. ఢిల్లీ కేంద్రంగా జరుగుతున్న ఉద్యమానికి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సంపూర్ణ మద్దతు వుంటుందన్నారు. డాక్టర్ స్వామినాథన్ సిఫార్సుల ప్రకారం సీ 2జి 50శాతం కలిపి మద్దతు ధరలు ప్రకటించి పార్లమెంట్‌లో చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. పంజాబు, హర్యాణా రాష్ట్రాల్లో రైతుల సమస్యల పరిష్కారానికి గత నవంబర్ 21వ నుండి ఆమరణదీక్ష చేస్తున్న జగ్జిత్‌సింగ్‌దల్లెవాలే ప్రాణాల్ని కాపాడాలని, రైతుల డిమాండ్ల పరిష్కారానికి యుద్ధ ప్రతిపాదికిన చర్యలు చేపట్టాలని కోరారు. సుప్రీంకోర్టుచే ఏర్పాటు చేసిన అధ్యయన కమిటీ కూడా రైతుల రుణమాఫీ, మద్దతు చట్టబద్ధత రైతాంగ ఆత్మహత్య నివారణ తదితర అంశాల పరిగణలలోకి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టడం అత్యంత దుర్మార్గమన్నారు. సమావేశంలో సిపిఐ నగర్ కార్యదర్శి శ్రీరాములు, వ్యవసాయ సంఘం ఆర్గనైజింగ్ కార్యదర్శి కందుకూరు నాగరాజు పాల్గొన్నారు.

# తూతూ మంత్రంగా కరువు బృందం పర్యటనలు వద్దు




**విశాలాంధ్ర-అనంతపురం:** కేంద్ర కరువు బృందం తూతూ మంత్రంగా పర్యటనలు చేయరాదని, ప్రణాళిక బద్ధంగా సహాయ చర్యలు చేపట్టాలని సీపీఐ, రైతు సంఘం జిల్లా కరువు రైతుల తరుపున సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024 ఖరీఫ్ జూన్ లో జిల్లాలో 2,96,803 రైతులు, 4,25,87 హెక్టార్లు ఖరీప్ జూన్ లో అగ్రికల్చరల్, హార్టికల్చరల్ పంటలు సాగు చేయగా పంట కీలక దశలో సెప్టెంబర్‌లో వర్షాలు రాకపోవడం వలన లక్షలాది ఎకరాలలో వేసిన పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. హెచ్ ఎల్‌సి కెనాలు అధునీకరణ లేక, హంద్రీ- నీవా నుండి సరిగా నీరు రాక ఆయకట్టు కింద వేసిన పంటలు బీళ్ళుగా మారుతున్నాయన్నారు. అప్పులు పెరిగిపోయి కుటుంబ పోషణ భారమై అనేకమంది రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని పేర్కొన్నారు. చివరకు పశువులకు కూడా పశుగ్రాసం దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. అనేక గ్రామాల్లో త్రాగునీరు సమస్య వస్తోంది. రైతులు వ్యవసాయ పనులులేక పట్టణ ప్రాంతాలకు వలసలు వెళుతున్నారు.. పరిస్థితి ఇంత దయనీయం గా ఉన్నా జిల్లా అంతా కరువు వుంటే కేవలం నార్పల అనంతపురం, విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బుక్కరాయ సముద్రం, రాప్తాడు మండలాలను మాత్రమే కరువు ప్రాంతాలుగా ప్రకటించి మిగతా మండలాలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. రబీలో కూడా దాదాపుగా లక్ష హెక్టార్లు పప్పు సెనగ, ఇతర చిరుధాన్య పంటలు కూడా సాగు చేసినా కూడా అకాల వర్షాల వలన పప్పుశనగ పులుసు కారిపోయి పూత పిందె పూర్తిగా రాలిపోయి పప్పుశనగ ఎకరాకు రెండు క్వింటాలు కూడా రాని పరిస్థితి ఉందన్నారు. ఆహార పంటలకు ఎకరాకు 30 వేలు, అగ్రికల్చర్ పంటలకు ఎకరాకు రూ.50 వేలు నష్టపరిహారం, హార్టికల్చర్ పంటలకు ఎకరాకు లక్ష రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని, రైతుల అన్ని రకాల రుణాలను రద్దు చేయాలని, కరువు సహాయక చర్యలు చేపట్టి గ్రామాలలో ఉపాధి పనులు వేంటనే ప్రారంభించాలన్నారు. గత14 సంవత్సరాలుగా ప్రాజెక్టులకు నిధులు వెచ్చించక ప్రాజెక్టు గేట్లు మరమ్మత్తులు చేయక కాలువలు,బ్రిడ్జీలు గండ్లుపడ్డాయి కంప,పిచ్చి మొక్కలతో కాలువలు నిండిపోయి నీటి జలాలు వృధా అవుతున్నాయన్నారు. పీఏబీఆర్, హంద్రీనీవా, ప్రాజెక్టు పునరుద్దరణ కోసం నిధులు కేటాయించాలని, జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం 10వేల కోట్లు కేటాయించాలన్నారు. జిల్లాలో పండ్ల తోటల అభివృద్ధి కోసం హార్టికల్చర్ హబ్‌ని, అగ్రికల్చర్ పంటల కోసం, వాణిజ్య పంటల కోసం ఉద్యాన పంటల కోసం నియోజకవర్గ కేంద్రాల్లో గిడ్డంగి కేంద్రాలు ఏర్పాటు చేయాలని, స్వామినాథన్ కమిటీ సిఫార్సులు మేరకు సి ం 2 ప్లస్ 50 ప్రకారం మద్దతు ధరల చట్టాన్ని అమలు చేయాలని, జిల్లాలో 31 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాలి, నష్టపోయిన పంటలకు పంటల వారీగా నష్టపరిహారం ఇవ్వాలని, పంటల బీమాలో సమూలమైన మార్పులు తీసుకురావాలి, ప్రభుత్వ రంగ బీమా సంస్థలకు ప్రీమియాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, 2023 పంట నష్టపరిహారం మిస్ మ్యాచ్ 1400 మంది రైతులకు 22. 11 కోట్ల రూపాయలు మొత్తం రైతులకు తక్షణమే అందించాలని కోరారు.

రిజర్వాయర్‌భూ నిర్వాసితుల ప్యాకేజీ, పునరావాస ప్యాకేజీని తక్షణమే గ్రామాల ప్రజలకు అందించా లన్నారు. భూమిలేని నిరుపేదలకు రెండు హెక్టార్లు సాగుభూమిని పేదలకు పంచాలన్నారు. చేనేతకార్మికులకు రుణాలు మాఫీ చేసి తిరిగి కొత్త రుణాలు ఇవ్వాలని, జిల్లాను శాశ్వత కరువు నుండి కాపాడాలని కరువు బృందాన్ని సీపీఐ రైతు సంఘం ద్వారా విజ్ఞప్తి చేశారు.

# ఘనంగా గొల్ల ఈశ్వరయ్య జన్మదిన వేడుకలు

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు, కడప జిల్లా కార్యదర్శి గొల్ల ఈశ్వరయ్య జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. నియోజక వర్గ కార్యదర్శి గోపాల్ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులతో కలిసి కేక్‌కట్ చేసి మిఠాయిలు పంచు కున్నారు. ఏఐవైఎఫ్ జిల్లా మహాసభల నిమిత్తం ఈశ్వరయ్య కళ్యాణదుర్గం మీదుగా రాయదుర్గం వెళుతున్నాడు అన్న సమాచారంతో ఆ పార్టీ నాయకులతో కలిసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎక్కడో పుట్టి ఎక్కడో పెరిగి ఇక్కడ నా జన్మదిన వేడుకలు చేసుకోవడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి నారాయణస్వామి, మల్లికార్జున, వీరితోపాటు కళ్యాణదుర్గం సిపిఐ నాయకులు బుడెన్ సాబ్, లక్ష్మీ దేవమ్మలు పాల్గొన్నారు.

# పార్టీలకు అతీతంగా అభివృద్ధికి సహకరించండి

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** కళ్యాణదుర్గం మున్సిపాలిటీ అభివృద్ధికి పార్టీలకు అతీతంగా సహకరించాలని పట్టణ కన్వీనర్ షేక్ శర్మాస్ వలి కోరారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ చాంబర్లో వైయస్‌ఆర్సీపీ కౌన్సిలర్లు అభివృద్ధికి సహకరించట్లేదని, పట్టణ ప్రజలకే అన్యాయం జరుగు తుంది అని ఆ పార్టీ కౌన్సిలర్లకు హితబోధ చేశారు. ఎమ్మెల్యే మున్సిపాలిటీ, పట్టణాభివృద్ధి, నియో జకవర్గ కోసం అహర్నిశలు పనిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులు సహకరించిన మీరు సమావేశాలు ఏర్పాటు చేయకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా వైసీపీ పార్టీకి చెందిన చైర్మన్ రాజుకి, ఆ పార్టీ కౌన్సిలర్లకు మున్సిపాలిటీ అభివృద్ధి కుంటుపడుతుందని, మున్సిపల్ సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధికి సహకరించాలని పలుమార్లు విన్నవించిన పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు.

అదే విషయమై నేడు కమిషనర్ స్థాయిలో నేను ప్రత్యక్షంగా, పరోక్షంగా గౌరవ ప్రదంగా వివరించగా ఎదురు దాడి చేయడం బాధ కలిగించిందన్నారు.

# ఈఎస్ఐ, పిఎఫ్ చెల్లించని కాంట్రాక్టర్‌ను బ్లాక్ లిస్టులో పెట్టాలి

## ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) రాష్ట్ర అధ్యక్షులు జె.రాజా రెడ్డి

**విశాలాంధ్ర-అనంతపురం :** ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) అనంతపురం నగరంలో మంగళవారం ఐఎం హాలులో ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి జిల్లా కోశాధికారి వెంకటేష్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ ) రాష్ట్ర అధ్యక్షులు కామ్రేడ్ జె.రాజారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలన్నారు. అనంతపురం నగరంలో ప్రభుత్వ హాస్పిటల్లో, మెడికల్ కళాశాలలో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్లో పనిచేసే శానిటేషన్,సెక్యూరిటీ గార్డుల వేతనాలను పెంచాలని, ఈఎస్ఐ, ఈపీఎఫ్ కార్మికుల ఖాతాల్లో చెల్లించని కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్టులో పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలిని కనీస వేతనం 26వేలకు పెంచాలి.కార్మికులకు పని ఒత్తిడి పనిచేసేందుకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు . మహిళలకు సంవత్సరానికి అదనంగా 15 రోజులు వేతనంతో కూడిన సెలవు ఇవ్వాలన్నారు. నెలనెలా ఖచ్చితంగా 1 వ తేదీన కార్మికులు ఖాతాలో జీతాలు జమ చేయాలి, లేని పక్షంలో ఉద్యమానికి శ్రీకారం చుడతామని కాంట్రాక్టర్లను హెచ్చరించారు. అనంతరం ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయిస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నగర అధ్యక్షులుగా జి.చిరంజీవి, నగర ప్రధాన కార్యదర్శిగా వెంకటేష్, గౌరవ అధ్యక్షులుగా వికె కృష్ణుడు, ఉపాధ్యక్షులు పామీద, ధనలక్ష్మి,అంజలి, సహాయ కార్యదర్శులు రేష్మ, వన్నూరు స్వామి, రామాంజనమ్మ కమిటీ సభ్యులుగా 19 ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్, నగర అధ్యక్ష, కార్యదర్శులు జి.చిరంజీవి, వి.కె కృష్ణుడు, మెడికల్ యూనియన్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు శ్రీనివాసులు, మనోహర్, జిల్లా నాయకులు నల్లమ్మ,శోభ, రామాంజనేయులు పాల్గొన్నారు.

# తేజ ప్రసాద్ మరణం జర్నలిస్టులోకానికి తీరని లోటు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్.. పలువురి నివాళులు

**విశాలాంధ్ర-అనంతపురం:** సీనియర్ జర్నలిస్ట్ తేజ ప్రసాద్ ఆకస్మిక మృతి జర్నలిస్టు లోకానికి తీరని లోటు అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్ పేర్కొన్నారు. అనంతపురం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో మంగళవారం తేజ ప్రసాద్ పార్థీవదేహాన్ని మెడికల్ విద్యార్థులకు పరిశోధన కోసం అప్పజెప్పడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్, సత్యసాయి జిల్లా సిపిఐ కార్యదర్శి వేమయ్య యాదవ్ తేజ ప్రసాద్ పార్టీవ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ... దాదాపు 30 సంవత్సరాలు పైగా సమాజంలో జరుగుతున్న మార్పులను వెలుగులోకి తీసుకుని వచ్చిన తేజ ప్రసాద్ సమాజం కోసం పనిచేస్తూ చివరి క్షణంలో తన పార్టీవ దేహాన్ని మెడికల్ కళాశాలలో చదువుతున్న మెడికల్ విద్యార్థులకు పరిశోధనల కోసం అప్పగిచడం అభినందనీయమన్నారు. ఆయన ఆత్మకి శాంతి చేకూరాలని మనస్ఫూర్తిగా భగవంతుని ప్రార్థిస్తున్నాను అన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు లింగమయ్య పాల్గొన్నారు.

## మృదుస్వభావి ..

**విశాలాంధ్ర-అనంతపురం:** సీనియర్ జర్నలిస్ట్ తేజ ప్రసాద్ మృదుస్వభావి అని సిపిఐ జిల్లా కార్యదర్శి సి జాఫర్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో తేజ ప్రసాద్ పార్థివ దేహానికి సిపిఐ జిల్లా కార్యదర్శి సి.జాఫర్, జిల్లా సహాయ కార్యదర్శి పి. నారాయణస్వామి, రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షులు జి ఈశ్వరయ్య, సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సి.జాఫర్ మాట్లాడుతూ... తేజ ప్రసాద్ కొన్ని సంవత్సరాలగా సుపరిచితుడు అని ఎప్పుడు కలిసినా కూడా పలకరించేవాడు అన్నారు. తను సీనియర్ జర్నలిస్ట్‌గా పని చేస్తూ జూనియర్లకు వార్తలు ఎలా రాయాలో తెలియజేసేవాడు అన్నారు. సమాజ సేవ కోసం పనిచేస్తూ తన మరణానంతరం కూడా ప్రజలకు ఉపయోగ పడేలా పార్థివ దేహాన్ని మెడికల్ విద్యార్థులకు అప్పగించడాన్ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను అని పేర్కొన్నారు. ఆయన ఆత్మ శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమం లో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగరాజుపాల్గొన్నారు.

## నివాళులర్పించిన సిపిఐ నాయకులు

**విశాలాంధ్ర-అనంతపురం:** సీనియర్ జర్నలిస్ట్ తేజ ప్రసాద్ పార్థివ దేహానికి మంగళవారం స్థానిక ప్రెస్ క్లబ్ లో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి చిరుతల మల్లికార్జున, ఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జె.రాజారెడ్డి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ... ఎప్పుడు ప్రెస్ క్లబ్ కు వచ్చిన ఎక్కడ కలిసిన ఆప్యాయంగా పలకరిస్తూ మా ద్వారా విషయాలను స్వీకరిస్తూ ప్రజలకు వార్త ద్వారా అందించేవారు అన్నారు. వివిధ ఛానల్లో పనిచేసి మంచి పేరు సంపాదించారన్నారు. ఆయన మృతి పట్ల ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు.

# కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ 15 మంజునాథ్ గౌడుకు ఘన సన్మానం

**విశాలాంధ్ర-బొమ్మనహాళ్ :** రాయదుర్గం నియోజక వర్గం జనసేన ఇంచార్జి మంజునాథ్ గౌడ్ రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం చేసిన విషయం తెలిసింది. అందులో భాగంగా మంగళవారం రాష్ట్ర కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ మంజునాథ్‌గౌడ్ స్వగృహంలో బొమ్మన హాళ్ మండలం జనసేన అధ్యక్షులు శివరాజ్ ఆధ్వర్యంలో శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. మండల జనసేన నాయకులు నాగార్జున, గొల్ల ఆనంద్ పాల్గొన్నారు.

# స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

## డిఆర్ఓఏ. మాలోలకు ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్ వినతి

**విశాలాంధ్ర-అనంతపురం :** మధ్యాహ్న భోజనం, ఆశా, అంగన్వాడీ,స్కూల్ ఆయాలు, వాచ్‌మెన్‌లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రాజేష్‌గౌడ్ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త పిలుపులో భాగంగా మంగళవారం ఏఐటీయూసీ జిల్లా సమితి ఆధ్వర్యంలో అనంతపురం కలెక్టర్ కార్యాలయంలో డీఆర్ఓ ఏ. మాలోలకి వినతిపత్రం అందజేశారు. రాజేష్ గౌడ్ మాట్లాడుతూ... స్కీం వర్కర్లుగా ఉన్న మధ్యాహ్న భోజనం, ఆశా, అంగన్వాడీ, స్కూల్ ఆయాలు, వాచ్మెన్లు చాలీచాలని వేతనాలతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారిందన్నారు, ఉద్యోగ భద్రత లేక స్కీం కార్మికులను ఇష్టానుసారంగా తొలగించారన్నారు, మధ్యాహ్న భోజన కార్మికులకు 10 వేలు వేతనం ఇవ్వాలన్నారు, ధరలకు అనుగుణంగా 30 రుపాయలు ప్రతి విద్యార్థికి మెస్ చార్జీలు ఇవ్వాలన్నారు, బకాయి ఉన్న బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు, ఆశా కార్మికులకు కనీస వేతనాలు 26 వేలు ఇవ్వాలన్నారు,ఆశా కార్మికులకు ఏఎన్ఎంలుగా ప్రమోషన్ ఇవ్వాలన్నారు, ఆశాలకు వేతనాలతో కూడిన సాధారణ, మెటర్నిటీ సెలవులు ఇవ్వాలన్నారు, మినీ అంగన్వాడీ టీచర్లను మెయిన్ అంగన్వాడీ టీచర్లుగా గుర్తించాలన్నారు,తెలంగాణ తరహాలో 18 వేలు వేతనం అమలుచేయాలన్నారు. స్కూల్ ఆయాలు వాచ్మెన్లకు 108 జిఓ ప్రకారం రూ.11,500లు వేతనాలు ఇవ్వాల న్నారు. స్కీం వర్కర్లకు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, అంతవరకు 26 వేలు వేతనం ఇవ్వాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యూటీ వెంటనే అమలు చేయాలన్నారు, ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నగర ప్రధాన కార్యదర్శి కృష్ణుడు,నగర అధ్యక్షులు చిరంజీవి, మధ్యాహ్నం భోజనం వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్ సి ఎం భాష,జిల్లా జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ రాజన్న,నాయకులు మురళి, మునిస్వామి, ప్రభుత్వ స్కూల్స్ ఆయాలు,వాచ్మెన్ యూనియన్ నాయకులు బాషా,రాములమ్మ,దేవి పాల్గొన్నారు.

# ఏఐవైఎఫ్ జిల్లా మహాసభలకు విద్యార్థులు భారీ ర్యాలీ

**విశాలాంధ్ర- రాయదుర్గం అర్బన్:** ఏఐవైఎఫ్ 20వ జిల్లా జిల్లా మహాసభలను ఘనంగా నిర్వహించారు. ఎన్నడూ లేని విధంగా విద్యార్థులు తరలి వచ్చి బహిరంగ సభను వరకు ర్యాలీగా వెళ్లి బహిరంగ సభలోని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జాతీయ నాయకులు గుజ్జుల ఈశ్వరయ్య మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు, నూతన పరిశ్రమలు కావాలి, మాకు మంచి చదువులు కావాలని, శ్లోకాలతో విద్యార్థుల్లో నూతన ఉత్సాహాన్ని మనోధైర్యాన్ని నింపారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు వల హక్కులకోసం పోరాడాలి అన్నారు. సంవత్సరాల తరబడి ప్రభుత్వాలు మారిన విద్యార్థులకు ఎటువంటి గుర్తింపు లేదన్నారు. బీజేపీ పదేళ్లుగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని పాలనలోకి రాకున్నా ముందు ఎన్నో హామీలు ఇచ్చారు. కానీ ఇప్పటికీ ప్రతి విద్యార్థి నిరుద్యోగులుగానే ఉన్నారన్నారు. విద్యను చదువుకోవాలన్న విద్యను కొనుగోలు చేయాల్సిన పరిస్థితి వచ్చింది. భారతీయ జనతా పార్టీ నరేంద్ర మోడీ అమీషా విద్యను వ్యాపారంగా మార్చారన్నారు. ఇదేవిధంగా కొనసాగితే ఏఐవైఎఫ్ తరఫున భారీ ఎత్తున ధర్నాలు నిర్వహిస్తామన్నారు. కేంద్రంలో రాష్ట్రంలో ఎంపీలు ఎమ్మెల్యేలు ఎంతోమంది మారుతున్నారే గాని విద్యార్థులకు ఎటువంటి న్యాయం జరగడం లేదన్నారు. అప్పటి మన్మోహన్ సింగ్ నుండి ఇప్పటి ప్రధాన మంత్రి వరకు నిర్మూలిస్తామని అన్నారు. కానీ పేదరికం పెరిగిపోతూనే ఉందని, దీనిపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని డిమాండ్ చేశారు.సిపిఐ జిల్లా ప్రధాన కార్యదర్శి జాఫర్ , సహాయ కార్యదర్శి నారాయణస్వామి మల్లికార్జున, ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శిలు లెనిన్ బాబు, రాజేంద్రప్రసాద్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సంజీవప్ప సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు నాగార్జున, జిల్లా అధ్యక్షుడు సంతోష్ కుమార్, రాయదుర్గం నియోజకవర్గం అధ్యక్షుడు కొత్రేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు కొల్లాయి స్వామి అంజి, జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థి ఆత్మహత్యాయత్నం

**విశాలాంధ్ర-అనంతపురం క్రైం:** స్థానిక తపోవనం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థి సంతోష్ ఆత్మహత్యాయత్నం చేసుకున్నారు. మంగళవారం పాఠశాలలో ఉన్న విద్యార్థులు రెండు గ్రూపులుగా ఓడిపోయి కొట్టుకున్నారు. దెబ్బలు తిన్న సంతోష్‌ను తోటి విద్యార్థులు అవహేళనగా మాట్లాడటంతో మనస్థాపానికి గురై ఇంటర్వెల్ సమయంలో బాత్రూంలోకి వెళ్లి బాత్రూంలో ఉంచిన ఫినాయిల్‌ను తాగి ఆత్మహత్యకు యత్నిం చాడు. ఉపాధ్యాయులు సదరు విద్యార్థిని హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యా

# వ్యవసాయ క్షేత్రంలో... కామ రాబందులు..

- ఫోన్ డిపిలో బాగుందంటే పని పేరుతో వేధింపులే..!
- మాయమాటలతో చిరు ఉద్యోగులకు వల..
- నోరు మెదపలేని దుస్థితి..

**విశాలాంధ్ర-లేపాక్షి:** తన కాలు మీద తాను జీవించాలనే ప్రయత్నంలో వ్యవసాయ క్షేత్రంలో స్వేదం చిందిస్తున్న చిరు ఉద్యోగులపై వ్యవసాయ శాఖలోని ఉన్నత అధికారులు కామలీలతో వేధించినట్టు సమాచారం. హిందూపురం నియోజకవర్గంలోని పలుచోట్ల పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బందిపై ఆ శాఖకు సంబంధించిన కామ రాబందులు కన్నేసి తమ వశం కాకపోతే ఇంటికి పంపిస్తాం... లేదా ఇంకో చోటికి బదిలీ చేస్తామని వేధిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భగవంతుడు ఇచ్చిన వరంతో పుట్టిన పుట్టుకను ఫోన్లో బంధించి డిపిగా వాడితే సంబంధిత శాఖలోని రాసలీలల ఘనులు నుండి వాట్సప్ కాల్ తో మాట్లాడడమే కాకుండా మాయమాటలతో మాయ చేస్తున్నట్టు సంబంధిత శాఖ నుండి బహిరంగ చర్చకు వచ్చింది. మాట వినకపోతే సమయం గాని, సమయాలలో ఫోన్ చేసి ఏం చేస్తున్నావ్ ? నీ నుంచి రైతుల ద్వారా మాకు ఫిర్యాదులు అందుతున్నాయి .పనిచేయడం చేతకాకపోతే ఇంటికి పంపిస్తామని, లేదంటే చెప్పినట్టు వినాలని అంటూ హూంకరిస్తున్నారు. ప్రశ్నిస్తే ఉద్యోగ సమస్యలు.. పోరాడితే ఉన్నత ఉద్యోగుల వేధింపుల మధ్య చిరు ఉద్యోగులు కొట్టుమిట్టాడుతున్నారు. సమస్యపై సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టి గుట్టు చప్పుడు కాకుండా చర్యలకు ఆదేశిస్తే నిజాలు బట్టబయలైతాయని సర్వత్రా డిమాండ్లు వ్యక్తం అవుతుఆన్నరు. రోజు రైతన్నకు బిడ్డగా సలహాదారు నిగా పొలాల చుట్టూ తిరిగి అవగాహన ఉన్నంతలో సలహాలు సూచనలిస్తూ తమ వంతు పాత్ర పోషిస్తూ నెల గడిస్తే ప్రభుత్వ జీతంతో బతికే చెట్టు కొమ్మలకు రక్షణ కరువైంది. పలుచోట్ల రైతు సేవ కేంద్రాలలో పనిచేసే ఉద్యోగులపై ఒత్తిళ్లు జరుగుతున్నట్టు తెలుస్తుంది. ఇప్పటికైనా వ్యవసాయ శాఖలోని వేధించే అధికారులపై ప్రత్యేక దృష్టి సారించి చర్యలు తీసుకోవాలని, నిమ్మకుండా వ్యవహరించడం సిగ్గుచేటని రైతులు అంటున్నారు.

## ఫిర్యాదులు అందుతున్న మాట వాస్తవమే

హిందూపురం పరిధిలోని కిందిస్థాయి సిబ్బంది నుండి ఒకటి రెండు ఫిర్యాదుల అందిన మాట వాస్తవమని దానిపై ప్రత్యేక దృష్టి పెట్టి విచారణకి ఆదేశించామని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు తెలిపారు.

# విద్యార్థులంతా పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి

## జిల్లా విద్యాశాఖ అధికారి క్రిస్టప్ప

**విశాలాంధ్ర-ధర్మవరం:** విద్యార్థులందరూ కూడా పట్టుదల క్రమశిక్షణతో కూడిన విద్యను తప్పక అభ్యసించినప్పుడే మంచి ఫలితాలతో పాటు మంచి గుర్తింపు సమాజంలో లభిస్తుందని జిల్లా విద్యాశాఖ అధికారి క్రిష్టప్ప తెలిపారు. అనంతరం వారు ధర్మవరం మండల పరిధిలోని ఉప్పునీసనపల్లి ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వివిధ రికార్డులను, మధ్యాహ్న భోజన పథకాన్ని వారు పరిశీలించారు. అనంతరం నేరుగా తరగతి గదులలోకి వెళ్లి వివిధ తరగతుల విద్యార్థులతో నేరుగా మాట్లాడి చదువు ఎలా ఉంది? పాఠాలు బాగా అర్థమవుతున్నాయా? మధ్యాహ్న భోజనం నాణ్యతగా రుచిగా ఉందా? లేదా? అన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక దశలో ఏ విధంగా చదువుకోవాలి అన్న విషయముపై దాదాపు 20 నిమిషాల పాటు అవగాహన కల్పించారు. ఈ పాఠశాలలో సంఖ్య తక్కువగా ఉన్నందున, హెడ్మాస్టర్ లింగారెడ్డి ఉపాధ్యాయులకు తప్పనిసరిగా విద్యార్థుల సంఖ్య వచ్చే సంవత్సరంలో పెంచాచాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, చదువుపై ప్రగతి తృప్తిగా ఉందని తెలిపారు. అనంతరం ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, సంజయ్ నగర్‌లోని బిఎస్ఆర్ బాలుర ఉన్నత పాఠశాలలో సాయంత్రం నిర్వహించబడుతున్న అదనపు తరగతులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ చదువుతున్న పదవ తరగతి విద్యార్థులపై పలు ప్రశ్నలను వేస్తూ, సమాధానాలను రాబట్టారు. విద్యార్థులతో మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షలు కేవలం నెల మాత్రమే ఉన్నందున, ఉపాధ్యాయులు చెప్పిన చదువును, తర్ఫీదు చేస్తున్న వివిధ స్టడీ మెటీరియలు తప్పక శ్రద్ధతో, అకుంఠిత దీక్షతో చదివినప్పుడే మంచి ఫలితాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. రాత్రిపూట కూడా తప్పనిసరిగా చదువుపైన దృష్టి పెట్టాల న్నారు. కార్యక్రమంలో ఉప్పునీసనపల్లి హెడ్మాస్టర్ లింగారెడ్డి, ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం శైలజ, బి ఎస్ ఆర్ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం రాంప్రసాద్ పాల్గొన్నారు.

## పాఠశాలల అభివృద్ధికి హెడ్మాస్టర్లే కీలకం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పాఠశాలల అభివృద్ధికి హెడ్మాస్టర్లే కీలకమని డీఈఓ కృష్ణప్ప తెలిపారు. మండల విద్యాశాఖ అధికారి కార్యాలయానికి పర్యటనలో భాగంగా రావడం జరిగింది. జిల్లా హెడ్మాస్టర్ అసోసియేషన్ కమిటీ వారు డిఈఓ ని కలిసి పలు పాఠశాలల, హెడ్మాస్టర్‌ల సమస్యలను వారికి వివరించారు. అనంతరం హెడ్మాస్టర్ అసోసియేషన్ నూతన సంవత్సరపు క్యాలెండర్‌లు, డైరీలను వారు విడుదల చేశారు. డీఈవో మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి మరింత కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్స్ అసోసియేషన్ రాష్ట్ర కౌన్సిలర్ నాగార్జున, జిల్లా పరీక్షల విభాగం కార్యదర్శి భాస్కర్ రెడ్డి, జిల్లా హెచ్ఎం అసోసియేషన్ ఉపాధ్యక్షులు మనోజ్ పాల్గొన్నారు.

# 13,14న సంక్రాంతి పండగ సందర్భంగా ఆటల పోటీలు..

## ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇంచార్జ్ హరీష్ బాబు.

**విశాలాంధ్ర-ధర్మవరం:** ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆశీస్సులతో 2025 నూతన సంవత్సరపు సంక్రాంతి పండగ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు ఎన్డీఏ కార్యాలయ మంత్రి ఇన్చార్జ్ హరీష్ బాబు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈ పోటీలు జనవరి 13, 14 తేదీలలో(రెండు రోజులపాటు) ధర్మవరం కాలేజీ గ్రౌండ్ లో జరగనున్నాయి అని తెలిపారు. యువతీ, యువకులు, మహిళలు, పెద్దలు అందరూ పాల్గొనాలని తెలిపారు. పోటీలు నిర్వహించడం ద్వారా సంప్రదాయాలను పటిష్టం చేయడమే కాకుండా, ఆరోగ్య క్రీడా విభాగంలో ప్రజల్లో చైతన్యం పెంచే అవకాశాలు ఉంటాయని తెలిపారు.

# సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలకు ఆహ్వానం

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని పుట్టపర్తి రోడ్డు, సాయి నగర్‌లో వెలిసిన శ్రీ శిరిడి సాయిబాబా దేవాలయంలో ఈనెల 9వ తేదీ సంక్రాంతి పండుగను పురస్కరించుకొని ఆలయ ఆవరణములో సంక్రాంతి ముత్యాల ముగ్గుల పోటీలను నిర్వహిస్తున్నట్లు శ్రీ షిరిడి సాయిబాబా సేవాసమితి అధ్యక్షులు వీరనారాయణ, కార్యదర్శి రామలింగయ్య, ఉపాధ్యక్షులు టిసి.నారాయణరెడ్డి, కోశాధికారి సూర్యనారాయణ తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ ముత్యాల ముగ్గుల పోటీలు ఉదయం 10 గంటలకు సాంప్రదాయ పద్ధతిలో పోటీలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఆసక్తిగల మహిళలు ఈనెల తొమ్మిదవ తేదీలోగా తమ పేర్లను ఆలయంలో వచ్చి నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రతి సంవత్సరం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. పట్టణ ప్రజలందరికీ కూడా ముందస్తుగా సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు కమిటీ వారు తెలియజేశారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబర్ 8297621055కు గాని ల్యాండ్ ఫోన్ నెంబర్ 08559-352668 కు సంప్రదించాలని తెలిపారు.

# ముక్కోటి ఏకాదశి వేడుకలకు తరలిరండి

**విశాలాంధ్ర-ధర్మవరం:** పట్టణంలోని బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో వెంకటేశులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ముక్కోటి ఏకాదశి వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఈనెల 13వ తేదీన ఉదయం 10 గంటలకు ఆలయంలో శ్రీ గోదాదేవి వారల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభముగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్ యాదవ్, ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పరిటాల శ్రీరామ్, జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. కళ్యాణోత్సవ వేడుకలు శాశ్వత దాతల చందా సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ముక్కోటి ఏకాదశికి విరాళంగా 50 వేల రూపాయలు పట్టు వస్త్రాలకు జింకా మణిమాల, జింకా రామాంజనేయులు ఇవ్వడం జరిగిందని తెలిపారు. ప్రసాద వినియోగ దాతలుగా కీర్తిశేషులు చెన్నం శెట్టి లక్ష్మీ దేవమ్మ కీర్తిశేషులు చెన్నం శెట్టి నాగభూషణముల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు చెన్నం శెట్టి నాగరత్నమ్మ, చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్ వ్యవహరిస్తారని తెలిపారు. ఆలయ అర్చకులు కోనేరాచార్యులు, మకరంద బాబు,భాను ప్రకాష్ ప్రత్యేక పూజలను వేదమంత్రాలు మంగళ వాయిద్యాలు నడుమ నిర్వహిస్తారని తెలిపారు. వైకుంఠ ఏకాదశి పాలక మండలిగా అడహక్ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాదు, కమిటీ సభ్యులు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. భక్తాదులు అధిక సంఖ్యలో వేడుకల్లో పాల్గొనాలని కోరారు.

# ప్రతిభ చూపిన ధర్మవరం లలిత నాట్య కళానికేతన్ ప్రదర్శన.



**విశాలాంధ్ర-ధర్మవరం:** తమిళనాడులోని అరుణాచలం దేవాలయంలో సకల వృత్తి కళాకారుల సంక్షేమ సంస్థ వారు నిర్వహించిన నేషనల్ లెవెల్ క్లాసికల్ క్లాసికల్ డాన్స్ ఫెస్టివల్ లో శ్రీ సత్య సాయి జిల్లా ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీ లలిత నాట్య కళానికేతన్ గురువులు బాబు బాలాజీ, కమలా బాలాజీ వారి శిష్య బృందం 40 మంది తమ నాట్య ప్రదర్శనతో అందరిని ముగ్దుల్ని చేసింది. నాట్యం చేసిన వారందరికీ ఆదియోగి అవార్డులు అందుకున్నారు. అదేవిధంగా గురువులు బాబు బాలాజీ, కమల బాలాజీలకు నాట్యతపస్వి అవార్డు, కుమార్తెలు హర్షశ్రీ,రామ లాలిత్యాలకు నాట్య చూడామణి అవార్డులతో ఆ సంస్థ అధ్యక్షుడు ఆనందు,ఆలయ ఈవో సురభి రాయల్ సర్టిఫికెట్స్ తో సహా మెమెంటోలను అందించి ఘనంగా సత్కరించారు. గురువులు మాట్లాడుతూ మాకు తమిళనాడులో ఇటువంటి అవకాశం కల్పించిన సంస్థకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలిపారు. భారతీయ సంస్కృతి సాంప్రదాయాలు జాతీయ అంతర్జాతీయ హాలో కూడా విస్తరింప చేస్తామని తెలిపారు. విశేష గుర్తింపుతో పాటు అవార్డులు ప్రశంసా పత్రాలు పొందడం పట్ల ధర్మవరం కళాకారులు, అధికారులు, ప్రజలు, హర్షం వ్యక్తం చేశారు.

## ఘనంగా అయ్యప్ప స్వామిపడి పూజ

**విశాలాంధ్ర-అగళి :** స్థానిక ఎస్సీ కాలనీలో మంగళవారం అయ్యప్ప స్వామి భక్తులు ఘనంగా పడిపూజ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఉదయాన్నే పురవీధులను శుభ్రం చేసి మామిడి అరటి ఆకులతో ప్రత్యేక అలంకరించారు. అనంతరం సాయంత్రం అయ్యప్ప స్వామి ఉత్సవ విగ్రహన్ని వివిధ పూలమాలలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజ కార్యక్రమం నిర్వహించి పడిపూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

# అబాకస్ పోటీల్లో సత్తా చాటిన హరీష్ స్కూల్ విద్యార్థులు

**విశాలాంధ్ర-కదిరి:** ఎరుకలవాండ్లపల్లి సమీపంలో ఉన్న హరీష్ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి అబాకాస్ పోటీల్లో సత్తా చాటారు. విశ్వం ఎడ్యుటెక్ వారి ఆధ్వర్యంలో ఆదివారం ధర్మవరంలో జరిగిన జిల్లాస్థాయి అబాకాస్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో 3వ తరగతి చదువుతున్న బి. ప్రణీత్ రెడ్డి ద్వితీయ బహుమతి, యం. జగదీష్ రెడ్డి తృతీయ బహుమతి కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ యం.యస్. కిరణ్ తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులతో మంగళవారం అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రణీత్ రెడ్డి ఫిబ్రవరి 9న విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటున్నట్లు ఆయన తెలిపారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులకు, శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయినులకు ప్రిన్సిపాల్ అభినందనలు తెలిపారు. తమ పాఠశాల విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నందుకు సంతోషదాయకంగా వుందని, విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి వెళ్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కలసిన మాజీ మంత్రి పల్లె

**విశాలాంధ్ర-పుట్టపర్తి :** రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ ను మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం విజయవాడలో ప్రధాన కార్యదర్శి చాంబర్ లో ప్రధాన కార్యదర్శిని కలిసి పుష్పగుచ్ఛం అందజేసి పల్లె నూతన సంవత్సర, సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పల్లె ఏపీని అభివృద్ధి పథంలో నడిపించాలని ప్రధాన కార్యదర్శిని పల్లె కోరారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలపడానికి కృషి చేస్తున్నారని చెప్పారు. వెనుకబడిన ఉమ్మడి జిల్లాల అభివృద్ధికి ప్రధాన కార్యదర్శి తో పాటు అధికార యంత్రాంగం ముఖ్య మంత్రి చేపడుతున్న కార్యక్రమాలను పూర్తిగా తీసుకొని అనంతపురం ఉమ్మడి జిల్లాల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ పథకాల అమలులో అధికారుల పాత్ర కీలకమన్నారు. రాష్ట్రం విడిపోయి అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని గత ఐదేళ్ల క్రితం రాష్ట్రం అన్ని విధాల వెనుకబడిపోయిందని తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడపడానికి అధికార యంత్రాంగం పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. నూతన ప్రధాన కార్యదర్శిగా నియమితులైనందుకు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రధాన కాలువ పూడికతీత పనులు పూర్తి

## పరిటాల శ్రీరామ్ చొరవతో వరినాట్లు ప్రారంభం

**విశాలాంధ్ర-ధర్మవరం:** ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ పరిటాల శ్రీరామ్ చొరవతో ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ఉన్న రైతులు వరినాట్లు ప్రారంభించారు. గత వైసిపి ప్రభుత్వ హయాంలో ఐదేళ్లుగా ధర్మవరం చెరువులో నిండుకుండలా నీరు ఉన్న వరిసాగు చేయలేక ఇబ్బంది రైతులు ఇబ్బందిపడ్డారు. పరిటాల శ్రీరామ్ ప్రధాన కాలువలను దాదాపు 30 రోజులు పాటు జెసిబిలతో పూడికతీత పనులు పూర్తిచేసి, ప్రధాన కాలువలు గుండా చెరువు నీరు ప్రవహించే విధంగా దోహదపడ్డారు. ఈ మేరకు ఆయకట్టు రైతులందరూ హర్షం వ్యక్తం చేశారు .గత 40 ఏళ్లుగా ధర్మవరం చెరువు ఆయకట్టు కింద ప్రధాన కాలువ పూడికతీత పనులు ఏ ఒక్కరు పట్టించుకోలేదని, కృతనిశ్చయంతో చేపట్టిన కార్యక్రమం విజయవంతమైంది

# సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే ఎలా!

**విశాలాంధ్ర-నంబులపూలకుంట:** మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం సమావేశ మందిరంలో మంగళవారం ఎంపిపి ఈటె రాము అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల ప్రగతి నివేదికలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు ఎంపిపి మాట్లాడుతూ మూడు నెలలకు ఒక సారి జరిగే సర్వసభ్య సమావేశానికి అధికారులు హాజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు. అధికారులు లేకపోతే గ్రామాలలో నెలకొన్న సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశానికి మూడు శాఖల అధికారులు హాజరు కాలేదని, ఆ అధికారులకు మెమోలు జారీ చేయాలని ఎంపిడివో అంజినప్పకు సిఫారసు చేశారు. అలాగే మండలంలో నాడు నేడు పథకం కింద జరుగుతున్న పనులపై ఎంఈఓతో ఆరా తీశారు. త్వరిత గతిన పనులయ్యేలా చూడాలని సూచించారు. ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి, పంచాయితీ అధికారులు సమన్వయంతో మండలాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. పశువైద్యాధికారి బాలా నాయక్ మాట్లాడుతూ సర్వే ల పేరుతో తమ విధులకు ఆటంకం కలుగుతున్నదని,తమ శాఖకు సర్వేల నుండి మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిపి రాము, ఎంపిడిఓ అంజినప్ప, తహసీల్దార్ దేవేంద్రనాయక్, వైస్ ఎంపిపిలు కేశవరెడ్డి, సంపూర్ణ, ఈపిఓఆర్డీ మాధవరెడ్డి, ఎంపిటిసిలు మాక్బూల్ బి, సరస్వతి, లక్ష్మీదేవి, కృష్ణమ్మ, తిమ్మారెడ్డి, సుబహాన్ సర్పంచులు పాల్గొన్నారు

# ఎస్సీ కులగణనపై 12వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

## - కలెక్టర్ టీ.ఎస్.చేతన్

**విశాలాంధ్ర-పుట్టపర్తి:** ఎస్సీ కులగణనపై నిర్వహిస్తున్న అభ్యంతరాల (ఆడిట్ ప్రక్రియ) స్వీకరణ గడువును జనవరి 12వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ టీ.ఎస్.చేతన్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు . ఎస్ఓపీ విధివిధానాలు తెలుపుతూ ప్రభుత్వం 265 నంబరు జీవో విడుదల చేసినట్లు తెలిపారు. ఈ మేరకు జనవరి 12వ తేదీ వరకు కులగణనపై నిర్దేశిత ప్రాంతాల్లో సంబంధిత అధికారులు ప్రజల నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తారన్నారు. స్వీకరించిన వివరాలను ఆన్లైన్ ప్రక్రియ ద్వారా జనవరి 16వ తేదీ వరకు అధికారులు నమోదు చేస్తారని, అనంతరం అన్ని తనిఖీలు పూర్తి చేసి తుది కులగణన సర్వే వివరాలను జనవరి 20వ తేదీన గ్రామ, వార్డు సచివాలయాల వద్ద విడుదల చేస్తారని వెల్లడించారు. మండల ప్రత్యేక అధికారులు సంబంధిత ప్రక్రియను పూర్తి స్థాయిలో పర్యవేక్షించాలని ఆదేశించారు.

# ప్రహారిగోడ కూలి విద్యార్థికి గాయాలు

**విశాలాంధ్ర-లేపాక్షి:** లేపాక్షి పంచాయితీ పరిధిలోని కుర్లపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ప్రహరి గోడ కూలి విద్యార్థికి గాయాలు కాగా హిందూపురం ప్రభుత్వం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. కుర్లపల్లి గ్రామానికి చెందిన రమేష్ గౌతమిల 3వ తరగతి చదువుతున్నాడు. అయితే మంగళవారం మధ్యాహ్నం సమయంలో విద్యార్థి మూత్ర విసర్జన కోసం ప్రహరి గోడ పక్కన వెళ్లారు. శిధిలావస్థలో వున్న ప్రహరి గోడ ఒక్కసారిగా కూలిపోవడంతో ఎడమ్ కాలుకు గాయపడ్డాడు. వెంటనే పక్కన వున్న విద్యార్థులు హెచ్ఎం దృష్టికి తెలియజేయగా వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్ వాహనం లో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

## ప్రమాదవశాత్తు బావిలో పడి మహిళ మృతి

**విశాలాంధ్ర-అమరాపురం:** మండల పరిధిలో అగ్రహారం గ్రామానికి చెందిన హనుమంతరాయప్ప భార్య భాగ్యమ్మ( 65) ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లు హెడ్ కానిస్టేబుల్ మధుసూదన్ తెలిపారు. తమ తోట సమీపంలోని బావిలో ప్రమాదవశాత్తు కాలుజారి పడిపోయి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# మనోధైర్యంతో బతకాలి

**విశాలాంధ్ర-పెనుకొండ:** మడకశిర రోడ్డులో ఉన్న ఎంక్యూఏ గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో మంగళవారం దివ్యాంగులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేశారు, ముఖ్యఅతిది సర్కిల్ ఇన్స్పెక్టర్ రాఘవన్ దివ్యాంగులు ప్రభుత్వ పథకాలను ఉపయోగించుకుని ఆత్మస్థైర్యంతో బతకాలన్నారు. పోటీ ప్రపంచంలో బాగా రాణించాల్సిన అవసరం ఉన్నదని తెలిపారు, అనంతరం గ్లోబల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు 300 మందికి దుప్పట్లను పంపిణీ చేశారు, ట్రస్ట్ చైర్మన్ కలిముల్లా, రిటైర్డ్ టీచర్ షమీవుల, పెనుకొండ మాజీ సర్పంచ్ శ్రీనివాసులు పాల్గొన్నారు

# ప్రకృతి సాగు మేలు

**విశాలాంధ్ర-గుడిబండ:** మండలంలోని చిగతుర్పి గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై జడ్పిఎన్ఎఫ్ అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చిగతుర్పి గ్రామంలో భోజరాజు పొలంలో ముల్లంగి, ఆముదం, బీన్స్, చిక్కుడు,అనుప,తదితర కూరగాయలు, ఆకుకూరలు పంటల విత్తనాలను ఎటిఎం పద్ధతిలో నాటారు. జడ్పిఎన్ఎఫ్ అధికారులు మాట్లాడుతూ రసాయనాల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంటి రమేష్, యూనిట్ ఇంచార్జ్ హనుమంత రాయప్ప, చిగతుర్పి ఐసిఆర్పి లు లలిత,సంధ్య,అంబిక పాల్గొన్నారు.

# హిందూపూర్‌లో ఘనంగా ఇస్తిమా

**విశాలాంధ్ర - హిందూపురం :** పట్టణ సమీపంలో గల మైదానంలో ముస్లిం సోదరులు ఇస్తిమా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ తో పాటు తెలంగాణ కర్ణాటక నుండి దాదాపు మూడు లక్షల దాకా, ఇస్తిమా విందుకు ముస్లిం సోదరులు పాల్గొన్నారు. ఇస్తిమా కార్యక్రమానికి హిందూపురం నియోజవర్గ తెలుగుదేశం సమన్వయకర్త శ్రీనివాసరావు ముస్లిం సోదరులు తలపెట్టిన ఇస్తిమా విందు ఏర్పాట్లను ముస్లిం మత పెద్దలతో మాట్లాడారు

# కిశోర బాలికల వికాసంపై శిక్షణ

**విశాలాంధ్ర-రొళ్ల:** కిశోర బాలికలు వారి జీవితంలో ఎదుర్కొనే సమస్యల పరిష్కారం కోసం చక్కటి విద్యతోపాటు జీవన నైపుణ్యాలపై అవగాహన పెంచుకోవాలని తహసీల్దార్ షేక్షావలి,ఎంపీడీవో రామారావు,ఆర్డిటి ఎ.టి.యల్ ఓబులేసు,ఎంఈఓ ఎస్.శ్రీధర్, సిడిపిఓ నాగమల్లేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు సచివాలయ ఉద్యోగులు,మహిళ పోలీసులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎం లు టీచర్లుకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని ఐసిడిఎస్ సూపర్వైజర్ సన్నమ్మ,నీలావతి ఆధ్వర్యంలో భేటీ బచావో-బేటి పడావో కిషోర్ వికాసంపై శిక్షణ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బాలికలు శారీరక మానసిక ఆరోగ్య పరిరక్షణకు సూచనలు చేశారు. యువత యువకులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మలేరియా హెల్త్ ఆఫీసర్ షమీముల్లా,వైద్యాధికారి సుధారాణి, కుసుమ,అరుణ శాంతమ్మ సచివాలయ సిబ్బంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# భూ సమస్యలు తప్పక పరిష్కరిస్తాం..

**విశాలాంధ్ర-తలుపుల:** గ్రామాలలో భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తుందని తహసిల్దార్ రెడ్డి శేఖర్ పేర్కొన్నారు. మంగళవారంర ఓదులపల్లి గ్రామంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. నూతనంగా నిర్మిస్తున్న సిసి రోడ్లకు భూ సమస్య ఉండడంతో వాటిని పరిశీలించి భూ సమస్యను పరిష్కరించారు. రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు, వీఆర్వోలు, సర్వేలు పాల్గొన్నారు.

# రోగం నయం కాక వృద్ధుడి ఆత్మహత్య

**విశాలాంధ్ర-రొళ్ల:** మండల పరిధిలోని చిగమతిగట్ట గ్రామానికి చెందిన గొల్లకల్లప్ప (63) అనారోగ్యంతో బాధపడుతూ పురుగులు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు దాదాపు 4 సంవత్సరాల నుండి షుగర్ వ్యాధితో బాధపడుతున్నాడు. గత 6 నెలల క్రితం కుడి కాలు బొటన వేలు శస్త్ర చికిత్స చేశారు అప్పటి నుండి కాలుకు గ్యాంగ్రీన్ అయి ఎక్కువనొప్పితో బాధపడుతూ ఉండేవాడు కాళ్ళ నొప్పులు తట్టుకోలేక ఆదివారం రాత్రి 11 గంటల సమయంలో తన ఇంటి వద్ద గల పొలంలో పత్తి పంటకు కొట్టు క్రిమిసంహారక మందు తాగి.. కొద్దిసేపటికి గట్టిగా కేకలు వేయడంతో ఇంట్లో నిద్రిస్తున్న భార్య, ఇతరులు వెళ్ళి చూసి, వెంటనే కర్ణాటక రాష్ట్రం శిర ఆసుపత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అందజేశారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తుమకూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించడగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి భార్య కరియమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ బాలాజీ తెలిపారు.

# పింఛన్లు పునః పరిశీలన..

**విశాలాంధ్ర-బుక్కపట్నం:** అంగవైకల్యం కలిగి మంచానికే పరిమితమై రూ.15 వేల పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారుల పింఛన్ల పునః పరిశీలన ప్రత్యేక డాక్టర్ల బృందం జనరల్ ఫిజీషియన్ డాక్టర్ల బృందం ఇమ్రాన్ ఖాద్రీ, రాఘవేంద్ర రాజు ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని సచివాలయం 1, 2 కొత్తకోట, అగ్రహారం గ్రామంలో ఇంటి వద్దకు వెళ్లి పరిశీలిం చారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పింఛన్‌దారుల స్థితిగతులను, లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలు, క్షుణ్ణంగా పరిశీలించి, లబ్ధిదారుల స్థితిగతులను తెలుసుకొని ఆన్లైన్ నందు వివరాలు నమోదుచేస్తామని తెలిపారు మండల వ్యాప్తంగా అంగ వైకల్యం కలిగి15 వేల రూపాయలు పింఛన్లు అందుకుంటున్న లబ్ధిదారులు 110 మంది ఉన్నట్లు అధికారులు తెలిపారు. నేడు కూడా పింఛన్ల పరిశీలన కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శివరాం, ఎస్సై కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సాదిక్, అలీ,వెల్ఫేర్ అసిస్టెంట్ జ్యోతి, అశోక్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# 9 నుంచి పాఠశాలలకు సంక్రాంతి సెలవులు

## పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఎంఈఓలు

**విశాలాంధ్ర-ధర్మవరం:** ప్రభుత్వ, జిల్లా కలెక్టర్, డీఈఓ ఆదేశాల మేరకు ధర్మవరం పట్టణం, మండల పరిధిలోని అన్ని ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 10వ తేదీ నుండి 19వ తేదీ వరకు సంక్రాంతి సెలవులు ప్రకటించడం జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు రాజేశ్వరి దేవి,గోపాల్ నాయక్ తెలిపారు. మైనారిటీ విద్యాసంస్థలకు మాత్రం ఈ నెల 11 నుండి 15 వరకు సంక్రాంతి సెలవులు ఉంటాయని తెలిపారు. ఈ సమాచారాన్ని పాఠశాల హెడ్మాస్టర్లు ఉపాధ్యాయుల ద్వారా సర్క్యులర్ పంపాలని తెలిపారు. తదుపరి సంక్రాంతి సెలవుల్లో విద్యార్థులు ఎవ్వరు కూడా తల్లిదండ్రులకు తెలియకుండా ఎక్కడికి వెళ్ళరాదని తెలిపారు. అంతేకాకుండా వేరే ఊర్లకు వెళ్లినప్పుడు కూడా తల్లిదండ్రులు తమ పిల్లల పట్ల జాగ్రత్తగా ఉంటూ, అప్పుడప్పుడు పరిశీలిస్తూ ఉండాలని తెలిపారు

విశాలాంధ్ర అనంతపురం/సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, బుధవారం 8, జనవరి 2025

## టిసిపిసి కేంద్రంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ

**విశాలాంధ్ర-అనంతపురం:** అనంతపురం నగరంలోని బళ్లారి రోడ్ లో మంగళవారం విభిన్న ప్రతిభావంతుల శాఖ పరిధిలో ఉన్న శిక్షణ మరియు ఉత్పత్తి కేంద్రంను (టిసిపిసి ) జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ పరిశీలించారు. టిసిపిసి కేంద్రంలో ఉన్న పరిసరాలను మరియు మూడు చక్రాల వాహనాల తయారీ కేంద్రాన్ని, స్టోర్ గదులను మరియు శిక్షణ తరగతి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అలాగే వాడుకలో ఉన్న వస్తువులను ఒక చోట, వాడుకలో లేని వస్తువులను ఒకచోట భద్ర పరచాలని సూచించారు. భవనము రీపేరి పనులను చేయించాలని, వాటి ప్రతిపాదనలను తయారుచేసి పంపాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల శాఖ సహాయక సంచాలకులు రాజ్ వినోద్ మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## జెమినీ ప్రసాద్‌కు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఘన నివాళులు

**విశాలాంధ్ర-రాప్తాడు:** సీనియర్ జర్నలిస్ట్ జెమినీ ప్రసాద్ (దేవప్రసాద్) అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్చార్జి పరిటాల శ్రీరామ్ మంగళవారం ఉదయం అనంతపురం ప్రెస్ క్లబ్ కు వచ్చి ప్రసాద్ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అక్కడే సీనియర్ జర్నలిస్టులతో వారు కాసేపు మాట్లాడారు. ప్రసాద్ తో పరిటాల కుటుంబానికి ఉన్న సన్నిహిత్యం గురించి గుర్తు చేసుకున్నారు. పరిటాల రవి ఆహ్వానం మేరకు చాలా సార్లు ప్రసాద్ వెంకటాపురం వచ్చే వారని, నాడు రాజకీయంగా ప్రసాద్ సూచనలు, సలహాలు ఇచ్చే వారని ఆయన సలహాలకు పరిటాల రవి కూడా ఎంతో విలువనిచ్చే వారన్నారు. పరిటాల రవీంద్ర ఉండి ఉంటే ఈ రోజు కన్నీరు పెట్టేవారని వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తిని కోల్పోవడం నిజంగా బాధాకరమన్నారు. ఆయన పార్థివదేహాన్ని మెడికల్ కళాశాలకు ఇవ్వడం గొప్ప విషయమన్నారు. జీవితమంతా ఆయన జర్నలిస్టులే కుటుంబంగా భావించారన్నారు. అనంతపురం జిల్లా మీడియా రంగానికి ప్రసాద్ లేకపోవడం పెద్ద లోటు అని వారు వ్యాఖ్యానించారు.

## బస్టాండ్ ఏర్పాటు ఎప్పుడో ?...

### నార్పలకు మండల కేంద్రంలో బస్టాండ్ లేదు షెల్టర్ లేదు...

**విశాలాంధ్ర-నార్పల :** మండల కేంద్రంలో ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటు కలగానే మిగిలింది. నేతల హామీలకే పరిమితమై పోయింది.బస్టాండ్ లేక ప్రయాణికులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.మరో రెండు రోజులు తర్వాత సంక్రాంతి సెలవులు ఉండడంతో విద్యార్థులు తమ ఊరు వెళ్ళడానికి బస్సు కోసం ఎండలోనే పడిగాపులు కాసే పరిస్థితి ఏర్పడింది.బస్టాండ్ నిర్మాణ విషయంలో ఎవరూ చొరవ చూపడం లేదన్న ఆరోపణలున్నాయి.బస్టాండ్ లేని కారణంగా బస్సులను రోడ్డుపైనే నిలుపుతున్నారు. దాంతో తరచుగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతోంది. పలు ప్రాంతాల నుంచి, ఇతర ప్రాంతాల నుంచి నిత్యం వేలాది మంది ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకోవడానికి విద్యార్థులు, అధికారులు, వ్యాపారస్తులు నిత్యం నార్పల కి రాకపోకలు సాగిస్తుంటారు.బస్టాండ్ లేకపోవడంతో రోడ్లపక్కన, హెూటళ్ళు, దుకాణాల ఎదుట బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు ఎండలో నిల్చునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతు న్నారు. బస్టాండ్ మాట అటుంచితే కనీసం ప్రయాణికులు కూర్చోవడానికి ఎటువంటి సదుపాయాలు ఏర్పాటు చేయక పోవడంపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు, అధికారులు మారిన నార్పల బస్టాండ్ నిర్మించడంలో విఫలం అవుతున్నారు. కూటమి ప్రభుత్వంలో నైనా బస్టాండ్ ను ఏర్పాటుచేసి మండల ప్రజలకు సౌకర్యవంతంగా తీర్చిదిద్దేలా స్థానిక ఎమ్మెల్యే బండారు శ్రావణి చేయగలుగుతుందా ? గతంలో ఎంతోమంది ఎమ్మెల్యే మారినప్పటికీ తన మార్క్ చూపించే దిశగా ఎమ్మెల్యే బండారు శ్రావణి అడుగులేస్తున్న క్రమంలో బస్టాండు మోక్షం రానున్నందని మండల ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## శ్రీకృష్ణదేవరాయ ఉద్యాన కేంద్రాన్ని సందర్శించిన పివికెకె విద్యార్థులు...

**విశాలాంధ్ర - జేఎన్టీయూ ఏ:** పివికెకె కళాశాలలో పీజీ బోటని మొదటి సంవత్సరం విద్యార్థులు అలమూరులోని శ్రీ కృష్ణదేవరాయ ఉద్యాన కళాశాలను మంగళవారం సందర్శించారు. కళాశాలలో ఉన్న జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్ , ప్లాంట్ ఫిజియాలజీ,ప్లాంట్ బయో టెక్నాలజీ , పాథలజీ ప్రయోగశాలలో ఉన్న పరికరాలు, వాటికి వాడే విధానాలు తెలుసుకున్నారు. జెల్ ఎలక్ట్రోఫోరెసిస్, బ్యాక్టీరియల్ కల్చర్, యువి స్పెక్ట్రో ఫోటో మీటర్ అంశాలపై అవగాహన ఉన్న కళాశాలలోని సహాయ ఆచార్యులు డాక్టర్. పూర్ణిమ, సౌమ్య సంక్షిప్తంగా విద్యారిని, విద్యార్థులకు వివరించారు. కళాశాల అధ్యయనంతో అధునాతన పరికరాల గురించి పూర్తి అవగాహనను పెంపొందించుకున్నామని విద్యార్థులు పేర్కొన్నారు. కళాశాల అసోసియేట్ డీన్, డాక్టర్. ఎన్.నారాయణ రెడ్డి ప్రేరణ, సహకారమునకు విద్యార్థులు ధన్యవాదాలు తెలిపారు. పిజి కళాశాల ప్రిన్సిపాల్ డా. ముని కృష్ణా రెడ్డి, నర్మద పర్యేక్షణ చేపట్టారు

## రాష్ట స్థాయిలో పథకాలు సాధించిన కీడాకారులను అభినందించిన ఉపాధ్యాయులు

**విశాలాంధ్ర -నార్పల :** రాష్ట్ర స్థాయి స్కూలు గేమ్స్ పోటీలలో పాల్గొని పలు విభాగాలలో పథకాలు సాధించిన నార్పల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడాకారులకు అబినందనలు తెలిపిన పాఠశాల ఉపాధ్యాయ బృందం మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. 2024-25 విద్యా సంవత్సరం గాను అండర్ 14-నెట్ బాల్ నందు సాయి మాదవ కాంస్య పతకం సాధించాడు. అండర్17-నెట్ బాల్ కు రామచరణ, పశాంత్. అండర్ 17 బేస్ బాల్ నందు హేమంత్ కుమార్ రెడ్డి, అండర్17 సాఫ్ట్ బాల్ నందు మున్నా, అండర్17 హాకీ నందు మనోజ్,రామచరణతేజ పాల్గొన్నారు. అలాగే అండర్-14 బేస్ బాల్ లో గురుప్రవీణ్ అండర్-14 సాఫ్ట్ బాల్ నందు మహేష్ అండర్-14 హాకీ నందు మహ్మద్ అవేజ్ గోల్ కీపర్ గా రాష్ట్ర స్థాయి నందు జిల్లా జట్లకు ప్రాతినిథ్యం వహించారు. అండర్-17 వాలీబాల్ నందు వెంకటేశ్వర రెడ్డి ఎంపిక అయిన అనారోగ్య కారణంచేత పాల్గొనలేకపోయాడు. పాఠశాల ప్రదానోపాధ్యాయుడు రవికుమార్ మాట్లాడుతూ అలాగే రాబోవు రోజుల్లో జాతీయ స్థాయి పోటీల లో కూడా పాల్గొన్ని నార్పల గ్రామానికి మంచిపేరు ప్రఖ్యాతి తేవాలని ఆకాంక్షించారు. కీడాకారులను తీర్చిదిద్దిన వ్యాయామ ఉపాధ్యాయులు ఆంజనేయులు నసీమా బేగం లకు పాఠశాల ఉపాధ్యాయ బృందం అభినందించారు.

## పెండింగ్ డీఏలు మంజూరు చేయాలి

**విశాలాంధ్ర -అగళి :** పెండింగ్ డీఏ బకాయిలతోపాటు వెంటనే మంజూరు చేయాలని, ఐఆర్‌ను ప్రకటించి పిఆర్‌సి కమిషన్ వేయాలని ఏపీటిఎఫ్ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్ చంద్ర, జిల్లా గౌరవాధ్యక్షులు మాధవ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వారు మంగళవారం అగళి మండలంలోని వివిధ పాఠశాలలలో సభ్యత్వ కార్యక్రమం నిర్వహించి నూతన క్యాలెండర్లు, డైరీ విడుదల చేశారు. ఈ కార్యక్రమం లో ఏపీటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యంజారప్ప, మండల కార్యదర్శి ప్రశాంత్, మండల అధ్యక్షులు విజయ్‌కుమార్, నాయకులు ఎల్.చంద్ర, శ్యాంసుందర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలలో తనిఖీలు...

**విశాలాంధ్ర-నార్పల :** మండల కేంద్రంలోని పలు ఎరువులు, క్రిమిసంహారక మం దుల దుకాణాలలో మంగళవారం వ్యవసాయ శాఖాధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమా మహేశ్వరమ్మ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు, విత్తనాలు, క్రిమిసంహారక మందులు విక్రయించాలని, సరైన బిల్లులు ఇవ్వాని, అమ్మకాల రికార్డులు నిర్వహించని దుకాణదారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తిరుమల ట్రేడర్స్ సంకల్ప దుకాణాలలో పురుగు మందుల నాణ్యతను తెలుసుకొనుట కొరకు పురుగు మందుల నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపారు. మండల వ్యవసాయ అధికారి సి చన్న వీర స్వామి,, సాంకేతిక వ్యవసాయ అధికారులు, వెంకట్ కుమార్,ఆర్.రాకేష్ పాల్గొన్నారు.

## పశువులకు ఉచిత గర్భకోశ శిబిరం ఏర్పాటు

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గంటౌన్:** పాడి రైతులకు ఎంతో ఉపయోగపడే విధంగా ఉచిత గర్భకోశ శిబిరాన్ని మంగళవారం ముదిగల్లు గ్రామంలో ఏర్పాటు చేశారు. ఏడి శ్రీనివాస గుప్తా ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా ఈ కార్యక్రమానికి డాక్టర్ పివి సుధాకర్ హాజరై వందలాది పశువులకు పైయ్యి దూడలు ఇవ్వగలిగే లింగ నిర్ధారిత వీర్యం ఉపయోగించి గర్భకోస చికిత్సను చేశారు. సత్యసాయి సమితి సౌజన్యంతో నిర్వహించారు. పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది రామమూర్తి, చౌదరి, రమణ, మాజీ కౌన్సిలర్ పూజారి ధనుంజయ, కౌన్సిలర్ కుర్ర రాము పాల్గొన్నారు.

## మౌలిక వసతులు కల్పించండి

**విశాలాంధ్ర-రాప్తాడు:** పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. విద్యాశాఖ అంశాలపై అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లా డీఈఓలు ప్రసాదబాబు, కిష్టప్ప, సమగ్రశిక్ష ఏపీసీ, ఇంజనీరింగ్ విభాగం, నియోజక వర్గంలోని ఆరు మండలాల ఎం.ఈ.ఓలతో అనంతపురం క్యాంప్ కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రణాళికలు రూపొందించాలన్నారు. నిర్మాణంలో ఉన్న పాఠశాల భవనాలు పూర్తి చేయాలని, అవసరమైన పనులను గుర్తించి నివేదికలు ఇవ్వాలన్నారు.

## సాంకేతికతను అలవర్చుకోవాలి

**విశాలాంధ్ర-శింగనమల:** మండలంలోని నాయనవారి పల్లి గ్రామంలో మంగళవారం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మయ్య, ప్రోగ్రాం కోఆర్డినేటర్ మల్లేశ్వరి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ భార్గవి, గుత్తి ఏడిఏ వెంకటరాముడు, సీనియర్ సైంటిస్ట్ రేకులకుంట డాక్టర్ జి.నారాయణస్వామి, మండల వ్యవసాయ అధికారి అన్వేష్ కుమార్, వెటర్నరీ డాక్టర్ మాధవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ సవిత, తెదేపా మండల కన్వీనర్ గుత్తఆది నారాయణ, గుర్రం లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యుడు రాజశేఖర్ తెలిపారు. పోలీసులు ఆరా తీస్తున్నారు.

## గొర్రెల పెంపకం దార్ల సంఘాలు టిడిపి కైవసం

**విశాలాంధ్ర-ఆత్మకూరు:** మండల పరిధిలోని రంగంపేట గొర్రెల సహకార సంఘం అధ్యక్షుడిగా అహెూబిలం, ఉపాధ్యక్షుడిగా నల్లప్పతోబాటు మరో ఐదు మంది సభ్యులు మంగళవారం ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. పి సిద్దరాంపురం అధ్యక్షుడిగా పిల్లల శివన్న, ఉపాధ్యక్షుడిగా మూడిళ్ల పెద్దన్న, మరో ఐదు మంది సభ్యులుగాను, వేపచెర్ల అధ్యక్షుడిగా బచ్చలయ్య, ఉపాధ్యక్షుడిగా వెంకటరాముడు, మరో ఐదు మంది సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మూడు సొసైటీలను టిడిపి కైవసం చేసుకుంది.

## కురబ సంఘం నూతన అధ్యక్షులుగా పర్వతం భీమ లింగయ్య.

విశాలాంధ్ర-గుత్తి: కురుబ సంఘం నూతన అధ్యక్షులుగా పర్వతం భీమలింగయ్య మంగళవారం ఏకగ్రీవంగా ఎంపిక య్యారు. ఈ సందర్భంగా కురుబ సంఘం నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. అలాగే ఉపాధ్యక్షుడి గా కుమార్ ను కురుబ సంఘం పెద్దలు శంకర్, కొంగనపల్లి వెంకటేష్, పూజారి శివ, రంగయ్య, సుబ్బరాయుడు, ఆంజనేయులు, గంపన్న, పిఆర్ పల్లి వెంకటరాముడు, పర్వతం శేఖర్, కురువ సంఘం నాయకులు కార్యకర్తలు ఆధ్వర్యంలో నూతన అధ్యక్షుని, కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

## దేహధారుడ్య పరీక్షలు ..

**విశాలాంధ్ర-అనంతపురం క్రైం:** స్థానిక నీం సంజీవరెడ్డి మైదానంలో జరుగుతున్న పోలీస్ కానిస్టేబుల్ అభ్యర్థుల దేహధారుడ్య పరీక్షలు (పిఎంటి-పిఈటి) మంగళవారం ఎస్పీ జగదీష్ స్వీయ పర్యవేక్షణలో జరుగుతున్నాయి. ఎత్తు, ఛాతి కొలతల అనంతరం 1600 మీటర్ల పరుగు, 100 మీటర్ల పరుగు,లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు.దళారులను ఆశ్రయించి మోసపోవద్దని, ఎస్పీ జగదీష్ సూచించారు. ఈనెల 16న దేహదారుఢ్య పరీక్షలు జరుగుతాయని, 8,9,10 తేదీలలో జరగాల్సిన దేహదారుఢ్య పరీక్షలు ఈనెల 17,18 , 20 తేదీలలో నిర్వహిస్తామన్నారు.

## గొర్రెల పెంపకం దారుల సహకార సంఘాల ఎన్నికలు

**విశాలాంధ్ర-కళ్యాణదుర్గం టౌన్:** మండల పరిధిలోని ముద్దినాయన పల్లి గ్రామంలో మంగళవారం గొర్రెల పెంపకం దారుల సంఘాలను ఏర్పాటు చేశారు. ముద్ది నాయన పల్లి సంఘానికి ప్రెసిడెంట్గా బి నవీన్,వైస్ ప్రెసిడెంట్‌గా రమేష్ లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా బాల వెంకటాపురం సంఘమునకు ప్రెసిడెంట్గా చిన్న రాజన్న, వైస్ ప్రెసిడెంట్గా మాధవయ్య ఎన్నికయ్యారు. ముద్దు నాయన పల్లి ఎలక్షన్ అధికారిగా డాక్టర్ సమతా రెడ్డి, కంబదూరు పశువైద్య అధికారి, బాల వెంకటాపురం ఎలక్షన్ అధికారిగా డాక్టర్ బి నవీన్ కుమార్ గుమ్మగట్ట మండల పశువైద్యాధికారి హాజరై ఎన్నికలు నిర్వహించారు. ఎం వెంకటం పల్లి ఎన్నికల అధికారిగా ,నిర్వహణ అధికారులుగా డాక్టర్ ఏ రమేష్ మరియు కళ్యాణదుర్గం మండల పరిషత్ డాక్టర్ పి మంజునాథ్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## గ్రంథాలయ పన్ను బకాయిలను జమ చేయించండి..

### -జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ

**విశాలాంధ్ర-రాప్తాడు:** మండల కేంద్రంలోని గ్రంథాలయానికి రావలసిన సెస్సు పన్ను బకాయిలను 16 గ్రామపంచాయతీల నుంచి గ్రంథాలయ ఖాతాకు జమ చేయించాలని ఎంపీడీఓ బి.విజయలక్ష్మిని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పి.రమ కోరారు. వార్షిక తనిఖీలో భాగంగా ఈ గ్రంథాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పాఠకులు గ్రంథాలయానికి రోజూ వచ్చేలా తగిన ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. వివిధ రకాల పుస్తకాలను పాఠకులకు అందుబాటులో ఉంచామని విద్యార్థులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రంథాలయాధికారి వి.వీరనారాయణరెడ్డి పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయానికి మరమత్తులు చేయిస్తాం..

**విశాలాంధ్ర-అమరాపురం:** అమరాపురం మండల పరిషత్ కార్యాలయం పూర్తిగా పైకప్పు దెబ్బ తినడంతో మరమ్మత్తు పనులు చేపడుతామనీ ఎంపీపీ ఈరన్న తెలిపారు. 1991లో నిర్మించిన ఈ భవనం క్షీణ దశకు చేరుకొందని పైకప్పు పెచ్చులు ఊడి ఇనుపచువలు బయటకు కనిపించడంతోపాటు చువ్వలు తుప్పు పట్టి కిందకు వేలాడుతున్నట్లు ఆయన తెలిపారు. మంగళవారం మడకశిర డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెంకటేశులు మరియు సీనియర్ అసిస్టెంట్ రాజేంద్రప్రసాద్ లు ఎంపీడీవో కార్యాలయాన్ని పర్యవేక్షించారు. భవనాల పైకప్పు వర్షాలకు తడిసి లోపలికి నీరు పడటంతో ఇనుప చువలు తుప్పు పట్టినట్లు గుర్తించారు. భవనం నిర్మించి 34 సంవత్సరాలు కావడంతో నాణ్యత లోపించినట్లు గుర్తించారు. త్వరలో మరమత్తు పనులకు సంబంధించి నివేదికలు ప్రభుత్వానికి పంపి నిధులు తెప్పించి పనులు ప్రారంభిస్తామన్నారు. ప్రస్తుతం కార్యాలయంలో సిబ్బంది కార్యాలయ పనులు చేయలేక ఆందోళనకు గురవుతున్నారు.ఎప్పుడు పైకప్పు పెచ్చులు ఊడి పడతాయోన%శీ%టూ బిక్కుబిక్కుమంటూ సిబ్బంది పనులు చేస్తున్నారని ఎంపీపీ ఈరన్న ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు త్వరలో చర్యలు తీసుకొని మండల పరిషత్ కార్యాలయం పైకప్పు మరమ్మత్తు పనులు చేపట్టాలని ఎంపీపీ ఈరన్న కోరారు.

## తరగతి గదిని మరమ్మతులు చేయిస్తాం

**విశాలాంధ్ర-లేపాక్షి :** లేపాక్షి లో నీ ఓరియంటల్ ఉన్నత పాఠశాలలో గత ఎన్నో రోజులుగా సిద్ధంగా ఉన్న తరగతి షెడ్డును మరమ్మతులు చేయిస్తామని కరణం రమా నందన్ తెలిపారు. ఉపాధ్యాయులు సూచన మేరకు పాఠశాలలకు సందర్శించి పరిశీలించారు. అనంతరం పనులకు అయ్యే ఖర్చును సంబంధిత కాంట్రాక్టర్ అంచనా లక్ష 25 వేల రూపాయలు ఖర్చు అయితుందని తెలియజేశారు. వెంటనే పనులు ప్రారంభించి పూర్తి చేయాలని. పదవ తరగతి పరీక్షలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చైర్మన్ తెలియజేసారు..

## ఆశా కార్యకర్తలతో సమావేశం

**విశాలాంధ్ర-యాడికి:** మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశ డే కార్యక్రమంలో భాగంగా ఆశా కార్యకర్తలతో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పరమేష్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు మాట్లాడుతూ మండలంలోని గ్రామంలో కచ్చితంగా ప్రతి దినము ఫీవర్ సర్వే ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని తెలిపారు. అదేవిధంగా ఏఎన్ఎంలు అందరూ రక్తపూతలు తీసి యాడికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని ల్యాబ్ కు పంపమని తెలియజేశారు. కార్యక్రమంలో యాడికి సిహెచ్ఓ జుబేదా, పీహెచ్ఎన్ వెంకటలక్ష్మి,, సూపర్వైజర్ రాంప్రసాద్ గౌడ్, ఎల్టీ కంప్యూటర్ సరిత, ఏఎన్ఎంలు, ఎల్ ఎంహెచ్‌పిలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 10వ తేదీన వరిగడ్డి వేలం

**విశాలాంధ్ర-కణేకల్లు:** కనేకల్ వ్యవసాయ విత్తన ఉత్పత్తి క్షేత్ర కార్యాలయంలో ఈనెల జనవరి 10వ తేదీన వరిగడ్డిని బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఫామ్ ఏడిఏ నారాయణ నాయక్ తెలిపారు. ఎస్ ఎస్ ఎం పి డి పొలంకు చెందిన ఖరీఫ్ 2024 సీజన్ కు సంబంధించిన 140 ఎకరాల వరిగడ్డిని శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు అందరి సమక్షంలోన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్ ఎస్ ఎం ఎఫ్ సేల్స్ ప్రొసీడ్స్ పేరున లక్ష రూపాయలు బ్యాంకు డిమాండ్ డ్రాఫ్టు కార్యాలయానికి సమర్పించి వేలం పాటలో పాల్గొనవచ్చని తెలిపారు.

## యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

**విశాలాంధ్ర-అగళి :** స్థానిక మండల రిసోర్స్ కార్యాలయం ఆవరణంలో మంగళవారం యుటిఎఫ్ క్యాలెండర్లను ఎంఈఓ చంద్రశేఖర్ చేతుల మీదుగా ఆవిష్కరించారు, కార్యక్రమానికి యుటిఎఫ్ మండల అధ్యక్షులు ప్రభు రాజు, ప్రధాన కార్యదర్శి శివశంకర్, యుటిఎఫ్ నాయకులు హరికృష్ణ, ఉపాధ్యాయులు భరత్ షబ్బీర్ అలీ నాగేంద్రబాబు, రాజు, అకౌంటెంట్ రవి, తిప్పే స్వామి, తదితరులు పాల్గొన్నారు, ఎంఈఓ మాట్లాడుతూ కొత్త సంవత్సరంలో ఉపాధ్యాయులకు అంతా మంచే జరగాలని విద్యాబోధనలో మరింత ఉత్సహంతో పనిచేయాలని ఆకాంక్షించారు.

## అయోడిన్ లోపంతో అనారోగ్య సమస్యలు

**విశాలాంధ్ర-అనంతపురం క్రైం:** అయోడిన్ లోపంతో చిన్నారులకు అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు వస్తాయిని పోషకాహార నిపుణులు డాక్టర్ చంద్రశేఖర్ అన్నారు.బుక్కరాయసముద్రం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం బయోడిన్ లోపంతో విద్యార్థులకు వచ్చే ఆరోగ్య సమస్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు వసుంధర దేవి అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథులుగా బుక్కరాయసముద్రం ఎంపీపీ దాసరి సునీత, సర్పంచ్ పార్వతి విచ్చేశారు.ఇనిస్టూట్ ఫర్ గ్లోబల్ డెవలప్మెంట్ వారి ఆధ్వర్యంలో స్మార్ట్ ఆశీర్వాద్ ప్రాజెక్టులో భాగంగా ఐటీసీ సహకారంతో ఈ అవగాహన కార్యక్రమం జరిగింది. ప్రధాన వక్తగా విచ్చేసిన డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూఉప్పులో అయోడిన్ ఉంటుందని, అయోడిన్ లోపం వల్ల విద్యార్థులకు అనేక రకాలైన ఆరోగ్య సమస్యలు వస్తాయన్నారు. అయోడిన్‌లో ఉండే సూక్ష్మ పోషకాలు విద్యార్థుల్లో చురుకుదనాన్ని పెంచుతాయున్నారు. కార్యక్రమంలో ఎంఈఓ నదిమా, ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది రామంజి, డిస్టిక్ కో ఆర్డినేటర్ దరగయ్య, ఐజీడి సిబ్బంది సుదర్శన్ రెడ్డి, మహమ్మద్ హుస్సేన్, పోతులయ్య, రహీనా పాల్గొన్నారు.

## స్మశాన సమస్యను పరిష్కరించి కొలతలు వేయించండి

**విశాలాంధ్ర-రాప్తాడు:** గ్రామంలోని స్మశాన వాటిక సమస్యను పరిష్కరించి కొలతలు వేయించాలని తహశీల్దార్ పి.విజయకుమారికి గ్రామస్తులు విన్నవించారు. మంగళవారం గంగలకుంట గ్రామంలో వీఆర్ఓ గీతా ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే దశాబ్దాలుగా ప్రస్తుతమున్న స్మశానంలో ఖననం చేస్తున్నామని, అయితే నిర్ణీత హద్దులు లేకపోవడంతో పక్క పొలాల వారితో ఇబ్బందులు పడుతున్నామన్నారు. గ్రామంలో గత ప్రభుత్వ హయాంలో రీ సర్వే పూర్తయిందని అయితే జాయింట్ ఎల్.పి.ఎం నెంబర్లు ఉండడం వల్ల ఆన్లైన్లో వన్-బి, అడంగల్ రావడం లేదన్నారు. భూమి కొలతల్లో తేడాలున్నాయని, సర్వే చేయించాలని మూడు అర్జీలు వచ్చాయి. అదేవిధంగా భూములకు రస్తా హద్దులు చూపించాలని కోరారు. మిగులు భూమికి పట్టా ఇవ్వాలని ఒక అర్జీ వచ్చింది. కార్యక్రమంలో సిఎస్డిటి జ్యోతి, సర్వేయర్ రామాంజనేయులు, కిష్ట, డీలర్ కుంటాల గంగాధర్ తదితరులు ఉన్నారు.

## సమయపాలన పాటించని ఆర్టీసీ బస్సులు

### ఆవేదన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు

**విశాలాంధ్ర-నంబులపూలకుంట :** కదిరి రాయచోటి ప్రధాన రహదారి గుండా వెళ్లే ఆర్టీసీ బస్సులు సమయపాలన పాటించకపోవడంతో ప్రజలు ఉద్యోగస్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రవాణా శాఖ మంత్రి ఉన్న అన్నమయ్య జిల్లా రాయచోటి నుండి కదిరి వరకు వెళ్లే ఆర్టీసీ బస్సులు భయాందోళనకు గురి అవుతున్నాయో ఏమో తెలియదు కానీ నిమిషాల వ్యవధిలో ఐదు ఆరు బస్సులు ఒకదాని వెనుక మరొకటిగా వెళ్తున్నాయి. తర్వాత బస్సు కోసం గంట సేపు నిరీక్షించాల్సి వస్తోందని ఉద్యోగస్తులు, ప్రజలు వాపోతున్నారు. బస్సుల తీరు మారకపోతే రానున్న కాలంలో రాస్తా రోకో నిర్వహిస్తామని తెలిపారు. అధికారులు చొరవ తీసుకొని సమయపాలన పాటించే విధంగా చూడాలని కోరుతున్నారు.

## అగాపే ఆశ్రమంలో అన్నదానం

**విశాలాంధ్ర-యాడికి:** మండల కేంద్రంలోని, కమలపాడు రోడ్డు, రాఘవేంద్ర కాలనీలో ఉన్న అగాపే ఆశ్రమంలో బెంగళూరు నివా సులు శ్రీనివాస్ రావు, జాన్,స్టీఫెన్ దాతృత్వంతో ఆశ్రమంలో ఉన్న వాళ్లందరికీ మంగళవారం అన్నదానం చేశారు. మా వంతుగా మేము చేయూత అందించామని తెలిపారు. ఆశ్రమ నిర్వాహకులు బత్తల ప్రసాద్, ఆశ్రమంలోని వారంతా వారికి కృతజ్ఞతలు తెలిపారు.